

లింబాద్రి గుట్టపై ఆలయం, మూల విరాట్టు



గ్రామ దేవతలకు సారెను సమర్పించేందుకు వెళ్తున్న పూజారులు

# నింబాచలానికి బ్రహ్మోత్సవ శోభ

- భక్తుల కొంగు బంగారం లక్ష్మీనారసింహుడు
- నేటి నుంచి లింబాద్రిగుట్ట బ్రహ్మోత్సవాలు

భీమ్‌గల్, నవంబర్ 17 : గౌతమీ (గోదావరి) నదికి దక్షిణ దిశగా రెండు యోజనాల దూరంలో ఉన్న శ్రీ లక్ష్మీనారసింహుడి దివ్యక్షేత్రం నింబాచలంగా విలసిల్లుతున్నది. దట్టమైన వేప చెట్లతో నిండి ఉండడంతో ఈ గుట్టకు నింబాచలంగా పేరు వచ్చినట్లు చరిత్ర. భీమ్‌గల్ మండల పరిధిలోని ఈ పుణ్యక్షేత్రం కాలక్రమేణా లింబాద్రి గుట్టగా ప్రసిద్ధి చెందింది. భక్తుల కొంగుబంగారంగా అలరారుతున్న స్వామివారి బ్రహోత్సవాలు నేటి (శనివారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా కార్తీక మాసంలో నిర్వహించే ఈ వేడుకల కోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామి వారి నిత్య కైంకర్యాల తోపాటు బ్రహ్మోత్సవాలను నంబి వంశస్థులు నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ధర్మకర్తగా నంబి లింబాద్రి వ్యవహరిస్తున్నారు.

**కమల పుష్కరిణి..**

కొండపై ఉన్న కమల పుష్కరిణి పూర్తిగా రాతి కట్టడంతో సుందరంగా ఉంటుంది. ఇందులోని నీటిని స్వామివారి పూజా కార్యక్రమాలకు మాత్రమే వినియోగిస్తారు. ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా కమల పుష్కరిణిలో చక్రస్నానం వేడుకను వైభవంగా నిర్వహిస్తారు.

**మంత్రి వేముల చొరవతో అభివృద్ధి..**

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవమూర్తులను గతంలో చెక్క రథంపై ఊరేగించేవారు. అది శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో ఇనుప రథాన్ని చేయించారు. గతంలో కొండకు రావడానికి రవాణా సౌకర్యం అంతంత మాత్రంగానే ఉండేది. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రూ. 2కోట్ల 60లక్షలతో కొండపైకి నాలుగు వరుసల రోడ్డు, సెంట్రింగ్ లైటింగ్, గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేకంగా రోడ్డును నిర్మించారు. దీంతో భక్తులకు సౌకర్యవంతంగా మారడంతోపాటు గుట్ట ప్రాంతం మరింత సుందరంగా మారింది. భక్తులు కేవలం జాతర సమయంలోనే పెద్ద సంఖ్యలో తరలివచ్చేవారు. ప్రస్తుతం ప్రతి శని, ఆదివారాల్లో భక్తుల తాకిడి పెరిగింది.

**గ్రామదేవతలకు సారె..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి తరపున గ్రామదేవతలకు శుక్రవారం ఆలయ అర్చకులు సారెను సమర్పించారు. మేళ తాళాలతో వెళ్లి పెద్దగంటి ఎల్లమ్మ, పోచమ్మకు సారెను అందించారు.

**రోజువారీ కార్యక్రమాలు**

- 18న కొండపైకి ఉత్సవ మూర్తుల పయనం
- 19న దీపారాధన, రక్షాబంధనం, విష్ణు పంచకం, అంకురార్పన, మృత్యుసంగ్రహణం, అంకురార్పనం, గరుడ పటాధివాసం, ధ్వజారోహణం, శ్రవణ ప్రయుక్త క్షీరాభిషేకం
- 20న నృసంహ ఏకాక్షరి హవనం
- 21న సాయంత్రం 5గంటలకు శ్రీవారి ఎదుర్కోలు
- 22న మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామివారి కల్యాణం
- 23న సర్వేషాం ఏకాదశి, చాతుర్మాస్య వ్రత సమాప్తి, నృసింహ ఏకాక్షర హవనం, గీతా హవనం, గరుడ సేవ
- 24న ఉత్థాన ద్వాదశి, తులసి వివాహం, కొండ ప్రదక్షిణ
- 25న వైకుంఠ చరుర్థి, ధాత్రి మూలే నృసింహ పూజ, ధాత్రి హవనం, డోలారోహనణం
- 26న చతుర్థశి ఉపరి పూర్ణిమ, జాతర, రథోత్సవం
- 27న శేషహోమం, స్నపన తిరు మంజనం, భాగవత ఫలశృతి, పూర్ణాహుతి, పుష్పయాగం
- 28న దేవతోద్వాసనం, ధ్వజారోహణం, ఉద్వాసన బలిప్రదానం, కొండబలి, డోలోత్సవం, గ్రామాలయానికి ఉత్సవ మూర్తుల పయనం

# అర్బన్ నియోజకవర్గానికి బ్యాలెట్ యూనిట్ల తరలింపు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 17 : శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రత నడుమ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి అర్బన్ నియోజకవర్గానికి బ్యాలెట్ యూనిట్లను శుక్రవారం తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల తరలింపు ప్రక్రియ నిర్వహించారు. పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనాల్లో వాటిని నియోజకవర్గకేంద్రానికి తరలించి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చారు. ఇప్పటికే అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లకు ఈవీఎంల తరలింపు పూర్తయ్యింది. అయితే అర్బన్ సెగ్మెంట్‌లో 21 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండడంతో పోలింగ్ నిర్వహణ కోసం అదనపు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేయడం అనివార్యమైంది. దీంతో అర్బన్ సెగ్మెంట్‌కు ఇదివరకు కేటాయించిన 361 బ్యాలెట్ యూనిట్లతోపాటు ప్రస్తుతం సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ జాబితా ప్రకారం.. మరో 361 బ్యాలెట్ యూనిట్లను కేటాయించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్ పాల్గొన్నారు.



బ్యాలెట్ యూనిట్ల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



కలెక్టర్, సీపీతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు అజయ్ వినాయక్, దీపక్ మిశ్రా

# ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర పరిశీలకుల సమీక్ష

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 17 : జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సమీక్షించారు. ఎన్నికల ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర జనరల్ అబ్జర్వర్ అజయ్ వినాయక్, రాష్ట్ర పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా, ఐపీఎస్‌లు శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ కలెక్టరేట్‌కు చేరకోగా.. జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు వారికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో పాటు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు గౌతమ్‌సింగ్, సుబ్రా చక్రవర్తి, లలిత్ నారాయణ్‌సింగ్ సందు, పోలీస్ అబ్జర్వర్ రుత్‌రాజ్‌తో భేటీ అయ్యారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వారికి వివరించారు. అర్బన్ నియోజకవర్గంలో 21 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున, రెండు చొప్పున బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సిన అవశ్యకత ఏర్పడిందని, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి అదనపు బ్యాలెట్ యూనిట్లను కేటాయించామని తెలిపారు. ఇప్పటికే అన్ని సెగ్మెంట్లకు ఈవీఎంలు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు ర్యాండమైజేషన్ పూర్తయిందని చెప్పారు. సీనియర్ సిటిజన్ ఓటర్లు 1310, దివ్యాంగ ఓటర్లు 1050 మంది ఇంటి నుంచి ఓటు వేసేందుకు వీలుగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న మరో 7733 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పోలింగ్, కౌటింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర పరిశీలకులు ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించరాదని, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేయాలని స్టేట్ అబ్జర్వర్లు పోలీస్ కమిషనర్‌కు సూచించారు. సమీక్షలలో అదనపు కలెక్టర్లు యాదిరెడ్డి, చిత్రామిశ్రా, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, అదనపు డీసీపీ జయరాం, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# నేడు కేటీఆర్ రోడ్‌షో

- కామారెడ్డి జిల్లా భిక్కనూరు, బీబీపేటలో పర్యటన
- ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమాలు

నిజామాబాద్, నవంబర్ 17
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కామారెడ్డి నియోజకవర్గంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. భారత రాష్ట్ర సమితి అధినేత, సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నియోజకవర్గం కావడంతో ప్రజల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఓటమి ఎరుగని నాయకుడిగా గుర్తింపు పొందిన కేసీఆర్‌కు కామారెడ్డిలో గెలుపు నల్లేరు మీద నడకే అన్నట్లుగా ఉండగా, భారీ మెజార్టీయే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రయత్నాలు చేస్తున్నది. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇన్‌చార్జిగా ఉన్న కామారెడ్డి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, ఇతర సమన్వయ కమిటీ సభ్యులంతా కలిసి భారీ మెజార్టీ కోసం శ్రమిస్తున్నారు. మండలాల వారీగా ఇన్‌చార్జిలను, 266 బూత్‌లకు బాధ్యులను ఇప్పటికే నియమించిన గులాబీ పార్టీ... రోజువారీగా శ్రేణులతో మాట్లాడుతూ సమన్వయం చేస్తున్నది. చేరికలతోపాటు ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్న వేళ.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో మరింత ఉత్సాహాన్ని అందించనున్నది. శనివారం కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూరు, బీబీపేట మండలాల్లో కేటీఆర్ పర్యటిస్తారు.



**గులాబీ సందడి...**

సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నియోజకవర్గం కావడంతో కామారెడ్డిలో శ్రేణులంతా కలిసి గులాబీ బాస్‌కు భారీ మెజార్టీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆరే స్వయంగా వచ్చి పోటీ చేస్తామంటే తామంతా మూకుమ్మడిగా ఓట్లేసి గెలిపించుకుంటామంటూ నియోజకవర్గమంతా ఇప్పటికే ఏకగ్రీవ తీర్మానాలు చేసి మద్దతు తెలిపింది. మాచారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, రాజంపేట, రామారెడ్డి, కామారెడ్డి మండలాల్లో భారీ ఎత్తున కుల సంఘాలు, గ్రామ పంచాయతీల వారీగా ఇప్పటికే తీర్మానాలు జరిగాయి. దీంతో కేసీఆర్ గెలుపు ఖాయమైనప్పటికీ మెజార్టీ మాత్రం భారీగా రావాలనే సంకల్పంతో బీఆర్‌ఎస్ కృషి చేస్తున్నది. కామారెడ్డి నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా ఈ ప్రాంతంపై దృష్టి సారించారు. ఇప్పటికే నియోజకవర్గ నేతలతో పలు దఫాలుగా సమావేశాలు, మండలాల వారీగా పార్టీ శ్రేణులతో సమీక్షలు, అంతర్గత సమావేశాలను నిర్వహించారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌తో ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలను తిప్పి కొట్టేందుకు వ్యూహాలను రచిస్తూ అమలు చేస్తున్నారు.

**ప్రజలతో ముఖాముఖి..**

ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ చేపట్టబోయే రోడ్‌షోలు నేరుగా ప్రజలతో ముఖాముఖి అన్నట్లుగా నిర్వహించబడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కేటీఆర్ తలపెట్టిన రోడ్ షోలకు పెద్ద ఎత్తున జనాలు తరలివచ్చి ప్రసంగాన్ని ఆలకిస్తున్నారు. కేటీఆర్ చెప్పే విషయాలను ఆలోచించి బీఆర్‌ఎస్ పార్టీకి మరోసారి జై కొట్టేందుకు సంసిద్ధులు అవుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 11గంటలకు భిక్కనూర్ మండలం పెద్ద మల్లారెడ్డి నుంచి రోడ్‌షో మొదలవుతోంది. పలు గ్రామాల్లో ఓపెన్ టాప్ బస్సు ద్వారా పర్యటిస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశించి కీలక ప్రసంగాన్ని కేటీఆర్ చేస్తారు. కాంగ్రెస్, బీజేపీ చేష్టలను, ఆ పార్టీల వైఖరిని తనదైన శైలిలో కేటీఆర్ తిప్పికొట్టబోతున్నారు. కామారెడ్డి నుంచి కేసీఆర్ రాక సందర్భంగా వచ్చే ప్రభుత్వంలో ఈ నియోజకవర్గానికి జరుగబోయే మేలును వివరించనున్నారు. నవంబర్ 9న జరిగిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ అఖండ విజయం సాధించిన తర్వాత జరుగుతున్న కేటీఆర్ కార్యక్రమాలను దిగ్విజయం చేసేందుకు బీఆర్‌ఎస్ నేతలంతా ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం ప్రచార సభ మాదిరిగానే రోడ్ షోను విజయవంతం చేసేందుకు ఇప్పటికే శ్రేణులను సమాయత్తం చేశారు. మధ్యా హ్నం 2గంటలకు బీబీపేట మండలంలోని కాచాపూర్, మాందాపూర్, జనగామ గ్రామాల్లో రోడ్ షో ఉంటుంది. 3గంటలకు బీబీపేట మండల కేంద్రంలో ప్రజలనుద్దేశించి మంత్రి కేటీఆర్, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రసంగిస్తారు.